క్లుప్తంగా

పీహెచ్‌సీ పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నరసింహప్రసాద్ పండా

మెళియాపుట్టి: ఆస్పత్రుల్లో వైద్యులు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ నరసింహప్రసాద్ పండా అన్నారు. శనివారం చాపర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. మందుల నిల్వలను పరిశీలించారు. అనంతరం వైద్యురాలు హేమంత లక్ష్మితో మాట్లాడుతూ.. గ్రామాల్లో మురుగునీరు, పారిశుద్ధ్యం మెరుగుపై అవగాహన కల్పించాలన్నారు. పీహెచ్‌సీలో అత్యవసర సేవలు అందించాలన్నారు. అనంతరం చాపర జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్మాణం చేపడుతున్న ప్రహరీ పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. సర్పంచ్ బి.రామారావు, కార్యదర్శి అప్పారావు ఉన్నారు.

రుచి, శుచి తప్పనిసరి



నడగాంలో ఎండీఎంను పరిశీలిస్తున్న ఎంఈఓ శాంతారావు

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతతోపాటు రుచిగా ఉండాలని ఎంఈఓలు శాంతారావు, దాలినాయుడు ఉండాలన్నారు. నడగాం, బడ్డవానిపేటల్లో స్కూళ్లను శాంతారావు, గడ్డెయ్యపేట పాఠశాలను దాలినాయుడు శనివారం తనిఖీ చేశారు. విద్యా ప్రమాణాలను పరిశీలించారు. ఎండీఎం అమలు తీరు, నాణ్యతపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

ప్రజ్ఞా వికాస్ పరీక్షల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పాతపట్నం: నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 9, 10వ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రజ్ఞా వికాస్ పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా కార్యదర్శి, జిల్లా కమిటీ సభ్యుడు డి.చందు, ఖగేష్ తెలిపారు. పాతపట్నం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల వద్ద ప్రజ్ఞా వికాస్ పరీక్షల పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. పదో తరగతి పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఈ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. పదో తరగతిలో అన్ని సబ్జెక్ట్‌లు కలిపి 100 మార్కులకు ఈ పరీక్ష ఉంటుందని, పరీక్ష ఫీజు రూ.30 చెల్లించాలన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్తడి నేలలను పరిరక్షించాలి



ర్యాలీ తీస్తున్న తాడివలస హైస్కూల్ విద్యార్థులు

పొందూరు: చిత్తడి నేలలను పరిరక్షించుకునేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని నేషనల్ గ్రీన్‌కోర్ క్లస్టర్ సమన్వయకర్త పూజారి హరిప్రసన్న తెలిపారు. ఫిబ్రవరి 2వ తేదీ ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా శనివారం తాడివలస ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం చిత్తడి నేలలు తగ్గుముఖం పడుతుండటం ఆందోళన కలిగిస్తుందన్నారు. చిత్తడి నేలలు జలచరాలకు, పక్షులకు ఆవాసమన్నారు. హెచ్ఎం బల్ల కంటయ్య, ఉపాధ్యాయులు రావాడ పాపారావు, గోపాలశెట్టి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు



వీరబ్రహ్మేంద్ర స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

సారవకోట: మండలంలోని కిన్నెరవాడ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక, విశేష పూజలను నిర్వహించినట్లు అర్చకులు సిద్ధయ్య స్వామి తెలిపారు.

కోడ్ అమలు ఇలాగేనా?



ఎల్.ఎన్.పేట: కొత్తూరు మండలం మెట్టూరు జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న ఫ్లెక్సీలు



ఎల్.ఎన్.పేట: కొత్తూరు మండలం శాస్త్రులపేట వద్ద ఏబీ రోడ్డు పక్కనే జనసేన పార్టీ ఫ్లెక్సీ



ఎల్.ఎన్.పేట: కొత్తూరు మండలం మెట్టూరు వద్ద టీడీపీ ఫ్లెక్సీ

- రహదారుల పక్కన దర్శనమిస్తున్న బ్యానర్లు, ఫ్లెక్సీలు
- అడుగడునా అధికారుల నిర్లక్ష్యం

ఎల్.ఎన్.పేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నాలుగు రోజుల క్రితమే అమల్లోకి వచ్చింది. పాతపట్నం నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ అమలుకు అధికారులు తిలోదకాలు ఇచ్చారు. కూటమి పార్టీలకు చెందిన నాయకుల బ్యానర్లు, అభివృద్ధి పనుల కోసం వేసిన శిలాఫలకాలు గ్రామాల్లో దర్శనమిస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. అలికాం–బత్తిలి (ఏబీ) ప్రధాన రహదారిలో ఎల్.ఎన్.పేట మండల కేంద్రం నుంచి కొత్తూరు వరకు ఎక్కడికక్కడే కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. అడుగడుగునా అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. అధికారంలో ఉన్న కూటమి పార్టీల నాయకులకు అధికారులు కొమ్ముకాశారా? లేక కూటమి నాయకులు కనుసన్నల్లో అధికారులు పని చేస్తున్నారా? అని సామాన్యులు సైతం విమర్శలు చేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉందని చెపుతున్న అధికారులే.. ఫ్లెక్సీలు, బ్యానర్లు, పెద్ద, పెద్ద కటౌట్లను తొలగించటంతోపాటు శిలాఫలకాలపై ఉన్న రాజకీయ పార్టీల నాయకుల పేర్లు కనిపించకుండా ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

- ఎల్.ఎన్.పేట మండల కేంద్రంలో కూటమి పార్టీలకు చెందిన నాయకుల ఫ్లెక్సీలు, బ్యానర్లు దర్శనమిస్తున్నాయి.
- హిరమండలం నుంచి కొత్తూరు వెళ్లే రోడ్డులో కొండరాగోలు జంక్షన్, నౌగుడ, శాస్త్రులపేటల వద్ద ఏబీ ప్రధాన రహదారి పక్కనే జనసేన పార్టీ నాయకుల ఫ్లెక్సీలు, బ్యానర్లు అలాగే ఉన్నాయి.
- కొత్తూరు మండలం మెట్టూరు వద్ద రోడ్డుకు రెండు వైపులా అడుగుకొకటి చెప్పున్న టీడీపీ నాయకుల ఫ్లెక్సీలు బ్యానర్లు ఉన్నాయి.
- కొత్తూరు మండలం మెట్టూరు కూడలి నుంచి జెడ్పీ హైస్కూల్ పక్క నుంచి వసప గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కనే పెద్దపెద్ద కటౌట్లు, బ్యానర్లను తొలగించలేదు.
- కొత్తూరు మండల కేంద్రంలో కూడా ఎక్కడికక్కడే కూటమి పార్టీల బ్యానర్లు ఉన్నాయి.
- పాతపట్నం నియోజకవర్గం కేంద్రంలోనూ బ్యానర్లు ఎక్కడకక్కడ దర్శనమిస్తున్నాయి.

కోడ్ ఉల్లంఘన..



తల్లి గ్రామానికి వెళ్లే రోడ్డులో ఫ్లెక్సీ

సారవకోట: ఎన్నికల నియమావళి ప్రస్తుతం జిల్లాలో అమలులో ఉన్నా.. మండలంలోని పలు గ్రామాల్లో అధికార పార్టీ రాజకీయ నాయకులకు అభినందనలు తెలిపే ఫ్లెక్సీలు కన్పిస్తున్నాయి. కోడ్ అమల్లోకి వచ్చినరోజు మండల కేంద్రంలోని ఫ్లెక్సీలను గ్రామ, మండల స్థాయి అధికారులు తొలగించారే తప్ప.. ఇతర గ్రామాల్లో ఉన్న ఫ్లెక్సీలను ఎక్కడా తొలగించలేదు. వడ్డినవలస, తొగిరి, కిన్నెరవాడ తదితర గ్రామాల్లో ఈ ఫ్లెక్సీలు శనివారం కూడా అలాగే ఉన్నాయి.

తక్షణమే చర్యలు తీసుకుంటాం



ఎమ్మెల్యే ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాజకీయ పార్టీల నాయకుల బ్యానర్లు తొలగించేందుకు తక్షణమే చర్యలు తీసుకుంటాం. రాజకీయ పార్టీల బ్యానర్లు తొలగించాలని పంచాయతీ కార్యదర్శులకు, గ్రామ సచివాలయ ఉద్యోగులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేయటం జరిగింది. ప్రైవేట్ వ్యక్తులకు బ్యానర్లు తొలగించాలని నోటీసులు ఇచ్చాం. ఉద్యోగులు నిర్లక్ష్యంగా పనిచేస్తే వారిపైన చర్యలు తీసుకుంటాం.

– పైడి శ్రీనివాసరావు, ఎంపీడీఓ, ఎల్.ఎన్.పేట

విద్యార్థులకు అండగా ఉంటాం



పోస్టర్‌ను విడుదల చేస్తున్న చింతాడ రవికుమార్

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త రవికుమార్

ఆమదాలవలస: విద్యార్థులకు ఫీజుల విషయంలో మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి ఆ విషయాన్ని గుర్తుచేస్తూ.. విద్యార్థులకు అండగా వైఎస్సార్‌సీపీ నిలుస్తోందని పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. ఆమదాలవలస పట్టణంలోని జగనన్న సేవా కార్యాలయంలో ఈ నెల 5న నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ ఫీజు పోరు పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్, వసతి దీవెన కింద ఇవ్వాల్సిన రూ.3,900 కోట్లు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యా సంస్థలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాయన్నారు. కొంతమంది విద్యార్థులు చదువు మధ్యలో ఆపేసి పనులకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కలెక్టర్‌కు పార్టీ తరపున వినతిపత్రం అందజేస్తామని, ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, మున్సిపాలిటీకి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై విజయవంతంచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్యనాయకులు సురవరపు నాగేశ్వరారవు, ఖండాపు గోవిందరావు, దుంపల శ్యామలరావు, బద్రి రామారావు, పొడుగు శ్రీనివాసరావు, మామిడి రమేష్, బి.వి.వి.రమణమూర్తి, ఎస్.రామారావు, మానుకొండ రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిలేని చదువుతో ఉత్తమ ఫలితాలు



కేజీబీవీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జనార్దనరావు

ఎల్.ఎన్.పేట: ఇంటర్, పదో తరగతి ప్రధాన పరీక్షలు సమీపిస్తున్న సమయంలో విద్యార్థులు మానసిక ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా చదువుకోవాలని, అప్పుడే ఉత్తమ ఫలితాలను సాధించగలరని సత్యసాయి సేవా సంస్థల ఆమదాలవలస జోనల్ కన్వీనర్ ఎం జనార్దనరావు అన్నారు. మండలంలోని కరకవలస జెడ్పీ ఉన్నత పాఠశాల, లక్ష్మీనర్సుపేట కేజీబీవీల్లో శనివారం పది, ఇంటర్ విద్యార్థులతో సమావేశమయ్యారు. పరీక్షల సమయంలో ఆహార నియమాలను పాటించి చదువులపైనే దృష్టి సారించాలన్నారు. చేతి రాతను మెరుగ్గా ఉంచుకోవాలన్నారు. కరకవలస పాఠశాల హెచ్ఎం పి.రామారావు, కేజీబీవీ ఎస్ఓ ఎం.వి.అంబిక, సత్యసాయి సంస్థల ఆమదాలవలస యూత్ కో ఆర్డినేటర్ బి.దామోదర్ పట్నాయక్, శ్యామలాపురం బాల వికాస్ గురువు ఎల్.శైలజ, తదితరులు పాల్గొన్నారు.

అరటి గెలల నీరాజనం



సారవకోట మండలంలోని కిన్నెరవాడ గల పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ఆవరణలో శనివారం భక్తులు 1,500 అరటి గెలలు వేలాడ దీశారు. ఆలయంలో జరుగుతున్న కల్యాణ మహోత్సవాల్లో భాగంగా భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు అరటి గెలలు వేలాడ దీశారు. ప్రతి ఏటా కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. – సారవకోట

శిథిలావస్థ..



నరసన్నపేట మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. పైకప్పు అంతా పాడైంది. వర్షం పడితే కారుతుంది. ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుంతో అని సిబ్బంది భయపడుతున్నారు. మరోపక్క గొడౌన్ కూడా ఉండటంతో దీంట్లో ఎలుకలు అధిక సంఖ్యలో ఉన్నాయి. పరిసరాలు కూడా అధ్వానంగా ఉండటంతో ఇక్కడకు వచ్చే రైతులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి కార్యాలయాన్ని పునర్ నిర్మించాలని సిబ్బంది, రైతులు కోరుతున్నారు. – నరసన్నపేట

నాగాభరణం వితరణ



సారవకోట మండల కేంద్రంలోని ఉమా త్రైలోకేశ్వర స్వామి ఆలయానికి చిన్న గుజ్జువాడ గ్రామానికి చెందిన కొండాల సీతారాం దంపతులు రూ.30 వేలు విలువ గల నాగాభరణాన్ని శనివారం అందజేశారు. ఆలయంలోని శివ లింగానికి ఏర్పాటు చేసేందుకు ఈ నాగాభరణాన్ని అందించినట్లు అర్చకులు విశ్వేశ్వరరావు తెలిపారు. పురోహితులు యజ్ఞేశ్వర శాస్త్రి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. – సారవకోట

నేత్ర పరీక్షలు



నరసన్నపేట మండలంలోని కిల్లాంలో శనివారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు జలుమూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ అసిస్టెంట్ బాలగంగాధరరాజు తెలిపారు. గోపాలపెంట, కోమర్తి, సత్యవరం, తామరాపల్లి, జమ్ము గ్రామాల్లో ఇంతవరకు 189 మందికి కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. శస్త్ర చికిత్సలకు 38 మందిని ఎంపిక చేశామన్నారు. ఈ నెల 12న మాకివలస పీహెచ్‌సీలో శంకర్ ఫౌండేషన్ ద్వారా శస్త్ర చికిత్సలు చేయిస్తామన్నారు. ఈ శిబిరానికి ఆధార్ కార్డును తీసుకురావాలన్నారు. – నరసన్నపేట

రాగి లడ్డూలు, పులిహోర వితరణ



వాహనాన్ని ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీఓ యశ్వంతకుమార్ రెడ్డి

బూర్జ: శ్రీకాకుళంలో జరగనున్న రథ సప్తమికి బూర్జ మండలంలోని పెద్దపేట గ్రామ ఆర్డ్స్ సంస్థ సౌజన్యంతో రాగి లడ్డూలు, పులిహోర ప్యాకెట్లు వితరణ చేసినట్లు సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు తెలియజేశారు. సీతంపేట మండలంలోని పెదరామలో గల మన్యం సహజ వీడీవీకే సభ్యుల ఆధ్వర్యంలో ఐటీడీఏ పీఓ సి.యశ్వంతకుమార్ రెడ్డి ప్రసాద వాహనాన్ని శనివారం ప్రారంభించారు. పీఓ మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో వీడీవీకే సభ్యులు ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డ్స్ సంస్థ ప్రతినిధులు నూక అనూప్ కుమార్, బి.శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

సమష్టి బాధ్యతతోనే కుష్టు వ్యాధి నిర్మూలన

- జిల్లా న్యాయ సేవా సాధికారిక సంస్థ కార్యదర్శి జస్టిస్ సన్యాసినాయుడు



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

జలుమూరు: ప్రజలందరి సమష్టి బాధ్యతతోనే కుష్టు వ్యాధి నిర్మూలన సాధ్యమని జిల్లా న్యాయ సేవా సాధికారిక సంస్థ కార్యదర్శి జస్టిస్ ఆర్.సన్యాసినాయుడు అన్నారు. జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లెప్రసీ హెల్పింగ్ హ్యాండ్ కార్యక్రమంలో శనివారం పాల్గొని మాట్లాడారు. సమాజంలో నేటికీ కుష్టు వ్యాధి పట్ల చిన్నచూపు, అపోహలు ఉన్నాయన్నారు. వాటిని తొలగించేందుకు వైద్యశాఖ సిబ్బంది మరింత బాధ్యతతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. గత పదేళ్లలో జలుమూరులో కుష్టు రోగులకు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి టి.వి.బాలకృష్ణ మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల ప్రేమతో ఉండాలన్నారు. వీరిని ఆదుకునేందుకు సేవా సంస్థలు ముందుకు రావడం సంతోషమన్నారు. అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తాడేల శ్రీకాంత్ మాట్లాడుతూ కుష్టు రోగులకు సహాయం అందించేందుకు దాతలు మరింత ముందుకు రావాలని కోరారు. దాతలు సమకూర్చిన దుప్పట్లు, తువ్వాళ్లు, సీటల్ ప్లేట్లు, గ్లాసులను రోగులకు సన్యాసినాయుడు పంపిణీ చేశారు. కొమనాపల్లి, అచ్చుతాపురం గ్రామాల సత్యసాయి సేవా సమితి సభ్యులు భోజనాలు సమకూర్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ మేరీ కేథరిన్, డీపీఎంఓ వాన సురేష్ కుమార్, మెడికల్ అధికారి చల్ల వంశీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మద్దతుగా నిలవాలి



కురిగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రచారం చేస్తున్న యూటీఎఫ్ నేతలు

కొత్తూరు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీడీఎఫ్ నుంచి పోటీ చేస్తున్న కె.విజయగౌరీని గెలిపించాలని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాశరావు కోరారు. విజయగౌరికి మద్దతుగా మండలంలోని కడుము, కురిగాం, మాతల, నవిగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలతోపాటు జూనియర్ కాలేజ్‌లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తున్న వజయగౌరి విజయానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. యూటీఎఫ్ నాయకులు బి.శ్రీను, కె.తిరుమలరావు, టి.సురేష్, బి.సంతోష్, బి.వీరభద్రయ్య, బాలకృష్ణ పాల్గొన్నారు.

పనిచేయని మంచినీటి బోరు



పాడైన తాగునీటి బోరు

సారవకోట: మండలంలోని తొగిరి పంచాయతీ కొమ్ముపలస గ్రామంలో గత కొంత కాలంగా తాగునీటి బోరు పనిచేయడం లేదు. దీంతో తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. సచివాలయ సిబ్బంది దృష్టి సారించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు బోరు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ ఫీజు పోరును విజయవంతం చేయండి



ఫీజు పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రెడ్డి శాంతి, నాయకులు

- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: విద్యార్థులకు అండగా నిలుస్తూ ఈ నెల 5న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఫీజు పోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తెలిపారు. పాతపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో ఫీజు పోరు పోస్టర్‌ను నియోజకవర్గ నాయకులతో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులు అన్యాయానికి గురవుతున్నారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన కింద రూ.3,900 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అవుతున్నా ఇంతవరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం దారుణమన్నారు. కోర్సులు పూర్తయిన విద్యార్థులకు ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో విద్యార్థులు చదువులు కొనసాగించలేక చాలా మంది పనులకు వెళ్తున్నారన్నారు. ఫీజు పోరులో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు, పార్టీ నాయకులతో కలిసి కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు ఎ.వి.సురేష్, చింతాడ సూర్యనారాయణ, బైపోతు ఉదయ్‌కుమార్, సవర రమేష్, అంపిలి బుచ్చిబాబు, ఎం.తాతయ్య, మీసాల రామకృష్ణ, సవిరిగాన ప్రదీప్, గండివలస ఆనందరావు, చింతం నర్సింహమూర్తి, వంగపల్లి చిన్నారావు, ఎనుగుతల సూర్యం, యర్లంకి ధర్మారావు, రెడ్డి రామారావు, సాధుబాబు, మామిడి గంగాధర్, పద్ద నేతాజీ, భాస్కర్‌దాస్, పోలాకి జయముని, బి.శ్రీరాములు, జానకమ్మ, పనుకు మోహన్, గోపాలరావు, తులుగు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలయ ప్రతిష్ట

కొత్తూరు:మండలంలోని పొనుటూరు కాలనీలో కోదండ రామాలయం ప్రతిష్ట కార్యక్రమం ఈ నెల 2 తేదీన శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. అనంతరం సీతారాముల కల్యాణం నిర్వహిస్తామన్నారు. జనవరి 31 తేదీ నుంచి మూడు రోజుల పాటు ప్రతిష్ఠోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. రెండో రోజు పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేశారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



ఓపీ విభాగాన్ని తనిఖీ చేస్తున్న డీసీహెచ్ఎస్ కల్యాణ్‌బాబు

- డీసీహెచ్ఎస్ కల్యాణ్ బాబు

పాతపట్నం: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీసీహెచ్ఎస్ కల్యాణ్ బాబు సూచించారు. పాతపట్నం సీహెచ్‌సీని శనివారం తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసరాలను, ఓపీ విభాగం, రోగుల వార్డులు, న్యూబోర్న్, బ్లడ్ బ్యాంక్ యూనిట్, రక్త పరీక్షల గదిని పరిశీలించారు. రోగుల వద్దకు వెళ్లి వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయా? లేదా అని అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలు సక్రమంగా అందించి, ఆస్పత్రికి మంచి పేరు తీసుకురావాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ జి.వేణుగోపాల్, డాక్టర్లు జి.అనిత, హెచ్.సునీత, షణ్ముఖరావు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీలో అవస్థలు!

సారవకోట: పింఛన్ల పంపిణీలో సచివాలయ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శనివారం ఉదయం నుంచి సర్వర్ పనిచేయలేదు. లబ్ధిదారులకు వారి ఇంటి ముందు నిల్చుని పింఛన్ పంపిణీ చేయాలనే ప్రభుత్వ నిబంధన ఉంది. ఇంటికి ఏ మాత్రం దూరంగా ఉన్నా సర్వర్ సపోర్ట్ చేయకపోవడంతో పంపిణీదారులతోపాటు లబ్ధిదారులు సైతం అవస్థలు పడ్డారు. కొన్ని గ్రామాల్లో నెట్‌వర్క్ సమస్యతో ఇతర ప్రాంతాలకు వెళ్లి పింఛన్ అందించారు. కొత్తగా వచ్చిన యాప్ వలన లబ్ధిదారులు ఇంటి వద్దే ఉండి పింఛన్ ఇవ్వాల్సి రావడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాతపట్నం: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పాతపట్నం మండలానికి శ్రీశైన సామాజిక వర్గానికి ఒక మద్యం షాపు కేటాయించినట్లు సీఐ కె.కృష్ణారావు శనివారం తెలిపారు. దరఖాస్తు చేసుకునేవారు శ్రీకాకుళం జిల్లా వాసి అయి ఉండాలని, శ్రీశైన సామాజిక వర్గానికి చెందిన వారై ఉండాలని, తహసీల్దార్‌తో ధ్రువీకరించిన సప్లమెంటరీ కుల ధ్రువపత్రం కలిగి ఉండాలన్నారు. ఫిబ్రవరి ఐదో తేదీలోగా దరఖాస్తులను తమ కార్యాలయానికి అందజేయాలన్నారు. ఫిబ్రవరి ఏడో తేదీన డ్రా తీసి షాపు కేటాయిస్తామని, ఈ అవకాశాన్ని శ్రీశైన సామాజికవర్గానికి చెందినవారు వినియోగించుకోవాలని సీఐ కోరారు.